పొలం గట్టు.. ఆదాయం వచ్చేట్టు..!


గొట్టిపల్లిలో పొలం గట్టుపై కందిసాగు

- పొలం గట్లపై పంటను వేస్తున్న రైతులు
- వరి పంటతో పాటు కందిసాగు
- అదనపు ఆదాయంతో ఆనందం

ఎల్.ఎన్.పేట: ఒకప్పుడు గిరిజన ప్రాంతాల్లో కొండ పోడు పంటగా సాగుచేసే కందిపంటను ఇప్పుడు గ్రామీణ ప్రాంత రైతులు వారి పొలం గట్లు, సాగు నీటి చెరువులు, కాలువల గట్లుపై పండిస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్ సాగు సమయంలో పొలంలో వరి పంట వేసుకుంటారు. పొలం గట్లుపై నుంచి రైతులు నడిచేందుకు ఖాళీగానే జాగా వదిలేస్తారు. అయితే అలా ఖాళీగా ఉన్న పొలంగట్లుపై పంటలు వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చని గత కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు. ఈ మేరకు గట్లుపైన కంది సాగు చేస్తూ రైతులు అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ పొలంగట్లపై కందిసాగు చేస్తున్నారు.

గట్లు నిండా కంది మొక్కలే

నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పొలం గట్లుతో పాటు పొలాలకు పక్కనే ఉన్న సాగునీటి చెరువులు, కాలువుల గట్లుపైన కంది సాగు చేస్తున్నారు. ఖరీఫ్ వరి పంటతో పాటు జూన్, జూలై నెలల్లోనే కంది విత్తనాలు వేస్తున్నామని రైతులు చెబుతున్నారు. పొలంలో సాగు చేస్తున్న వరి పంటకు ఎరువు వేసినప్పుడు కాస్త ఎరువు గట్లుపైన వేస్తామంటున్నారు. దీంతో ఎలాంటి అదనపు పెట్టుబడి లేకుండానే కంది పంట చేతికి అంది వస్తోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏడాది కంది సాగు చేస్తున్నామని దబ్బపాడు, తురకపేట, జాడుపేట, గొట్టిపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు పల్లి అప్పలనాయుడు, కంచరాన అచ్యుత రావు, కర్నం చంద్రినాయుడు, శిమ్మ శ్రీరాములు తదితరులు తెలిపారు. ప్రస్తుతం ఐదు మండలాల పరిధిలో పలు గ్రామాలకు చెందిన సుమారు 1,850 మంది రైతులు పొలం గట్లుపై కంది సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు సూచిస్తున్నాయి.

పంట బాగుంది



మా పొలంకు పక్కనే సాగునీటి చెరువు, కాలువ గట్లు ఉన్నాయి. కాలువ, చెరువు గట్లుపై ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి కంది విత్తనాలు వేసుకున్నాను. ఈ ఏడాది కంది మొక్కలు చాలా బాగున్నాయి. ఇంటి అవసరాలకు సరిపడా కందులు దిగుబడి వస్తాయని అనుకుంటున్నాను. ప్రతీ ఏడాది కంది పంట వేస్తున్నాను. కంది సాగు కోసం ఎలాంటి పెట్టుబడులు పెట్టలేదు. ఒక రోజు కష్టపడి విత్తనాలు వేయడం జరిగింది.

–దూబ ఈశ్వరరావు, రైతు, తురకపేట, ఎల్.ఎన్.పేట

ప్రోత్సహిస్తున్నాం



పప్పు ధాన్యాల సాగు ప్రోత్సాహంలో భాగంగా ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి పొలం గట్లుపై కంది సాగు చేసేందుకు ప్రోత్సహిస్తున్నాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పుడు రైతులకు కంది సాగు చేయాలని అవగాహన కలిగిస్తున్నాం. పంట కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాం. సాగు విస్తీర్ణం ఈ ఏడాది పెరిగింది. రైతులు కూడా ముందుకు వస్తున్నారు.

–పైడి లతశ్రీ, ఏవో, ఎల్.ఎన్.పేట

క్లుప్తంగా

హాస్టల్ భవన నిర్మాణం పరిశీలన


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: మండలంలోని గొట్ట లక్ష్మీపురం వద్ద నిర్మిస్తున్న వసతి గృహం పనులను జిల్లా సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ పూడి జనార్ధనరావు శనివారం పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి హాస్టల్ భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రూ.2.30 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా, పూర్తి నిబంధనలతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు ఎంఈవో రాంబాబు, ఏఈ బుచ్చిబాబు ఉన్నారు.

గిరిజన యువతకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

కొత్తూరు: మండలంలోని ఆల్తి పంచాయతీ తామరగూడలో గిరిజన యువతకు సంక్షేమ పథకాలు, ఆదివాసీ చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సును వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు ఏవిధంగా పొందాలి అనే అంశాలపై ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ రామకృష్ణతో పాటు గ్రామ సచివాలయం సిబ్బంది అవగాహన కల్పించారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టంతో పాటు పలు రకాల గిరిజన చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో గ్రామ సచివాలయం సిబ్బంది నవీన్, చంటి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కేవీజీ సత్యనారాయణకు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

బూర్జ: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శిగా నియమితులైన కేవీజీ సత్యనారాయణను శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని ఆయన స్వగృహంలో బూర్జ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తి నాయుడు, మండల పార్టీ ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, నాయకుడు జల్లు బలరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు: మండలంలోని వసప గ్రామానికి చెందిన వలురౌతు తిరుపతిరావు గత కొన్నేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వైద్య సహాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు రూ.3,08,176లు మంజూరు అయింది. మంజూరైన మొత్తాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వసప గ్రామంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బాధితుడికి అందజేశాడు. ఎంపీడీవో నీరజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఒడిశా మద్యం బాటిళ్లు స్వాధీనం

పాతపట్నం: ఒడిశా నుంచి 4 మద్యం బాటిళ్లను విశాఖపట్నంకు చెందిన వ్యక్తి శనివారం తీసుకొస్తుండగా, పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద ఏఎస్‌ఐ కృష్ణారావుకు పట్టుబడ్డాడు. 4 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

హుండీ ఆదాయం రూ.1.10 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణ గ్రామదేవత పాలపోలమ్మ తల్లి ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొదలవలస రమేష్ ఆధ్వర్యంలో శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, నిర్వాహకులు మాట్లాడుతూ.. గత 40 రోజులకు గానూ రూ.1.10 లక్షల ఆదాయం భక్తుల కానుకల ద్వారా వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాతిన రమణమూర్తి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని వినియోగించుకోవాలి


నరసన్నపేట: దేశ్ కా ప్రకృతి అభియాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎమ్మెల్యే బగ్గు తదితరులు

నరసన్నపేట: ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో ఉన్న ఆయుర్వేదిక్ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేదిక్ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రణలో ఉంచవచ్చన్నారు. అనంతరం దేశ కా ప్రకృతి అభియాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ యాప్‌లో అందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వైద్యురాలు సీతా మహాలక్ష్మి సూచించారు.

సారవకోట: హోమియో వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని తిలారు హోమియో వైద్య కేంద్రం వైద్యుడు పి.శంకరరావు సూచించారు. మండలంలోని బొంతు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు హోమియో వైద్య సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యంలో అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకోవచ్చునని, అలాగే పలు వ్యాధులు రాకుండా ముందస్తుగా మందులు వేసుకోవచ్చునన్నారు. ఆయనతో పాటు స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు సుస్మిత ఉన్నారు.

ఇష్టారాజ్యంగా నీటి సంఘాల ఓటర్ల జాబితా


ఆర్‌ఐ గవరయ్యకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ఇష్టారాజ్యంగా తయారు చేశారని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల జాబితాల్లో అనేక తప్పులు చోటు చేసుకున్నాయని తెలియజేస్తూ శనివారం కోవిలాం గ్రామానికి చెందిన రైతులు నడిపల్లి నారాయణరావు, కొమరాపు చిరంజీవిలు ఆర్‌ఐ ఎస్.గవరయ్యకు ఫిర్యాదు చేశారు. వంశధార 7ఎల్ పిల్ల కాలువ పరిధిలో కోవిలాం రెవెన్యూ గ్రామానికి చెందిన రైతులు ఉండగా, ఇక్కడి రైతులను తీసుకెళ్లి 10ఎల్ పిల్ల కాలువ పరిధిలో వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. 10ఎల్ కాలువ కోవిలాం రెవెన్యూ గ్రామానికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. 10ఎల్ కాలువ దిగువన తమ గ్రామానికి చెందిన పంట భూములు లేవన్నారు. ఎలాంటి సంబంధం లేని 10ఎల్ పరిధిలో ఎందుకు ఓటర్లుగా చేర్పించారని ప్రశ్నించారు. 5ఎల్ కాలువతో తమకు సంబంధం లేనప్పటికీ, కొందరు రైతులను 5ఎల్ కాలువ పరిధిలో వేశారని ఆరోపించారు. 10ఎల్, 5ఎల్ పరిధిలో ఉన్న రైతులను పేర్లు తొలగించి, 7ఎల్ కాలువ పరిధిలో చేర్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. సమస్యను తహసీల్దారు ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆర్‌ఐ గవరయ్య తెలిపారు.

కూరగాయల సాగుతో ఆదాయం


ఏటీఎం పద్ధతుల్లో సాగుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో కూరగాయలు సాగు చేయడం వలన ప్రతిరోజూ ఆదాయం పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండలంలోని తురకపేట సెంటర్‌లో ఏటీఎం విధానంలో కూరగాయల సాగును సిద్ధం చేశారు. ఈ విధానంలో ఎరువులు, పురుగు మందులు, రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకరమైన కూరగాయలను పండించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో సేంద్రీయ ఎరువులను వాడడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. రైతులు ఎవరైనా ముందుకొస్తే ఏటీఎం పద్ధతులతో పాటు ఇతర విధానాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు బొంగు సంతోషి, బి.పూర్ణారావు, ఐ.జ్యోతి, మట్ట రాధిక, వంకట భవానీ, ప్రధాన పూజ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు హాజరవ్వాలి


ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: ఈనెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న సమన్వయ కమిటీ సమావేశానికి తల్లిదండ్రులు హాజరు కావాలని ఎంఈవో రాంబాబు సూచించారు. పాఠశాలలకు ప్రోగ్రెస్ కార్డులను శనివారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థి ప్రగతి గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఎక్కడైనా లోపాలుంటే సమన్వయం చేసుకోవాలన్నారు. అదేరోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనాలు చేయాలని సూచించారు. త్వరలో పాఠశాల నిర్వహణకు సంబంధించి నిధులు పాఠశాలల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలోని రాపాకలో ఎన్‌సీడీ క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం వలన పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. అలాగే ఇంటింటా సిబ్బంది చేపడుతున్న టీబీ, బీపీ, షుగర్ పరీక్షలను ఆమె పరిశీలించారు. అదేవిధంగా లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. అనంతరం పొందూరు పట్టణంలోని అంగన్వాడీ కేంద్రం సందర్శించి చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందజేస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు వైద్యాధికారులు డా.రమేష్‌నాయుడు, డా.శివశంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఆమదాలవలస: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్ సుందర్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు ఆధ్వర్యంలో పట్టణంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.రాజారావు, ధనుంజయరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'రెండు మాధ్యమాల్లో ప్రశ్నాపత్రాలు ఉండాలి'

పొందూరు: రానున్న పదో తరగతి పరీక్షల పశ్నాపత్రాలు రెండు మాధ్యమాల్లోనూ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చాలా పాఠశాలల్లో 9, 10 తరగతుల్లో ఆంగ్ల మాధ్యమంలోనే బోధన జరిగిందన్నారు. అందువలన ప్రశ్నాపత్రాల్లో ఖచ్చితంగా రెండు మాధ్యమాల్లోనూ ప్రశ్నలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సర్వసభ్య సమావేశం రేపు

బూర్జ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.00 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరవ్వనున్నట్లు తెలిపారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నేడు

జలుమూరు: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నామని పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చల్ల దుర్గా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోడల్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించినవారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.1000లు అందించనున్నామన్నారు. విద్యార్థులకు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు భోజన వసతి సౌకర్యం ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో మాధవరావు

జలుమూరు: మధ్యాహ్న భోజన నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మండల విద్యాశాఖ అధికారి బి.మాధవరావు అన్నారు. మండలంలోని యలమంచిలి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం పరిశీలించారు. శుచి, శుభ్రతతోపాటు మెనూ ఖచ్చితంగా పాటించాలన్నారు. ఆయనతో పాటు హెచ్‌ఎం రఘునాథరావు ఉన్నారు.

పరామర్శ


గురునాథరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలువురిని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం పరామర్శించారు. చిన్నకొల్లివలస పునరావాస కాలనీకి చెందిన తర్ర గురునాథరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. బొత్తాడసింగి సర్పంచ్ ఈగల భవానీ అత్త ఈరమ్మ, లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్‌ఐ మహాదేవ వెంకటరమణ, తురకపేట–కృష్ణాపురం సర్పంచ్ మొదలవలస యోగీశ్వరి అత్త మొదలవలస అప్పలసూరమ్మ ఇటీవల మరణించారు. దీంతో ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెతో పాటు ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పార్టీ నాయకులు ముగడ జనార్ధన, బలగ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గోతులమయం



సరుబుజ్జిలి మండలంలోని పలు ఆర్అండ్‌బీ రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. రహదారుల్లో ప్రయాణాలు చేయడానికి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సవలాపురం జంక్షన్ నుంచి పెద్దసవళాపురం, యరగాం నుంచి ఇస్కలపాలెం, సుబ్బపేట, ఎంఎస్‌పురం, సవలాపురం జంక్షన్ల వరకు ఉన్న రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రహదారులపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాళ్లు తేలాయి. ఏమాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరడంవలన వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పెద్దసవళాపురం సమీపంలో రహదారి పరిస్థితి ఇది.

– సరుబుజ్జిలి

విద్యార్థుల అవస్థలు



బూర్జ మండలంలోని బూర్జ, చీడివలస, పాలవలస గ్రామాల్లో మూడు ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుతానికి ఒక్కటే పనిచేస్తుండడంతో అపార్ కోసం విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలం మొత్తానికి 16 సచివాలయాల ఉన్నప్పటికీ, మూడు ఆధార్ కేంద్రాలను మాత్రమే మంజూరు చేశారు. వాటిలో ఒక్క పాలవలస సచివాలయంలో మాత్రమే ఆధార్ కేంద్రం పని చేస్తుండడంతో మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు అక్కడకే వెళ్లాల్సి వస్తోంది. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడు కేంద్రాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

– బూర్జ

ప్రమాదకరంగా వైర్లు



పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి(సీహెచ్‌సీ) కూడలిలోని జూబ్లీ రోడ్డులో ఫైబర్ వైర్లు నాలుగు అడుగుల ఎత్తులో వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందువలన ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వైర్లను సరి చేయాలని కోరుతున్నారు.

– పాతపట్నం

ఖైదీలకు అందుతున్న సేవలపై ఆరా


రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: స్థానిక సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీలకు అందుతున్న సేవలపై జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ ఆరా తీశారు. శనివారం జైలును సందర్శించిన ఆమె రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఎటువంటి సమస్యలున్నా తెలియజేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా న్యాయ సేవా సమితి ద్వారా ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందించనున్నామని, కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హింసకు పాల్పడవద్దని, వివాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఆమెతో పాటు ఏజీపీ గొండు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

చట్టాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి కందికట్ల రాణి

హిరమండలం: మహిళలు చట్టాలను, ప్రాథమిక హక్కులను వినియోగించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధి, కొత్తూరు సీనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణి సూచించారు. రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఆదేశాల మేరకు మహిళా కమిషన్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎక్కడైనా మహిళల హక్కులకు భంగం కలిగిస్తే న్యాయసేవాధికార సంస్థ సలహాలు, సూచనలు అందిస్తుందన్నారు. టోల్ ఫ్రీ నంబర్ల ద్వారా ఉచిత న్యాయ సాయం పొందవచ్చని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు హరిప్రియ, సౌజన్య, తహసీల్దార్ నందిగాం హనుమంతురావు, ఎంపీడీవో రఘు పాత్రుని కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన


నరసన్నపేట: దీపాలంకరణలో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా అర్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం చేపట్టారు. రాధాకృష్ణుల బొమ్మను ఆలయ ప్రాంగణంలో వేసి దాని చుట్టూ దీపాలంకరణ చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ


జలుమూరు: ఆలయంలో భక్తులు

జలుమూరు: దక్షిణ కాశీగా పిలువబడే శ్రీముఖలింగంలో కార్తీక మాసం ఆఖరి శనివారం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. దీనిలో భాగంగా స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అలాగే వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.